సిద్ధమవుతున్న అమ్మఆదర్శ పాఠశాలలు



పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు, అమీన్‌పూర్‌ మండలాలలో 38 అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి మరమ్మతులు చేయించారు. పటాన్‌చెరు మండల పరిధిలో 26 ఎంపిక చేసి రూ. ఒక కోటి, ఇరవైఐదు లక్షలు మంజూరు చేసి మరమ్మతులు చేయించారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.అదే విధంగా అమీన్‌పూర్‌ మండల పరిధిలో 12 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక చేయగా మరమ్మతుల కోసం రూ. 43 లక్షల మంజూరు చేశారు. మొత్తం 12 ప్రభుత్వ పాఠశాలలలో 90 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

టీబీపై కార్మికులకు అవగాహన



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న పురుషోత్తం

పటాన్‌చెరు టౌన్‌: క్షయ వ్యాధి పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని టీబీ అలర్ట్‌ ఇండియా ప్రతినిధి స్టేట్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ పురుషోత్తం అన్నారు. గురువారం పటాన్‌చెరు మండల పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని సెనర్జ్‌ గ్లోబల్‌ టూల్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ పరిశ్రమలో టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా క్షయ నిర్మూలన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్‌ పురుషోత్తం మాట్లాడుతూ.. క్షయ వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎవరికైనా క్షయ లక్షణాలు ఉన్నట్లు అనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నిర్మూలన కార్యక్రమం సిబ్బంది దేవేందర్‌ రాజ్‌, టిబి అలర్ట్‌ ఇండియా డిస్టిక్‌ ఫీల్డ్‌ ఆఫీసర్‌ కృష్ణ, శ్రీకాంత్‌ , కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ వాటర్‌ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌ పాపిరెడ్డినగర్‌లో అక్రమంగా కొనసాగుతున్న వాటర్‌ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని పాపిరెడ్డినగర్‌ అధ్యక్షులు చంద్రారెడ్డి కోరారు. గురువారం విద్యుత్‌శాఖ అధికారి శరత్‌ బాబును కలిసి సమస్యను వివరించారు. నిత్యం లక్షల లీటర్ల నీటిని తోడేస్తున్నారని, ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత విభాగాల అధికారులకు విన్నవించినా తూతూ మంత్రంగా చర్యలు తీసుకొని వదిలేస్తున్నారని చంద్రారెడ్డి పేర్కొన్నారు. పాపిరెడ్డినగర్‌లో సుమారు ఐదు వాటర్‌ ప్లాంట్‌లు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్నారు. తహశీల్దార్‌ ఆదేశంతో ఆర్‌ఐ వాటర్‌ ప్లాంట్లను సీజ్‌ చేసిన తరువాత రోజు నుంచే వాటర్‌ ప్లాంట్‌లు కొనసాగిస్తున్నారని,ఈ అక్రమ వాటర్‌ ప్లాంట్లతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, బస్తీలో నీటి సమస్యలు పెరుగుతున్నాయన్నారు. వాటర్‌ప్లాంట్లతో విద్యుత్‌ సమస్య ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు మొగుళ్ల కనకారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్‌ పరీక్షను రద్దు చేయాలి



పరీక్షలను రద్దు చేయాలంటూ జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు టౌన్‌: జాతీయ పరీక్షలలో ఎన్‌టీఏ, విద్యాశాఖలు బాధ్యతరహితంగా వ్యవహరించిన నీట్‌ పరీక్షను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వర్‌ రావు,మహిపాల్‌, వినోద్‌ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు- మెదక్‌ రైల్వే లైన్‌ను అభివృద్ధి చేయండి

మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు



రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌ జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ రఘునందన్‌ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : పటాన్‌చెరు నుంచి మెదక్‌ వరకు రైల్వేలైన్‌ను అభివృద్ధి చేయాలని మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. గురువారం దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌ జైన్‌ను కలసి రైల్వే సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు నుంచి మెదక్‌ వరకు రైల్వేలైన్‌ను అభివృద్ధి చేయాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌, ఈదులనాగులపల్లి మధ్య రెల్వేట్రాక్‌పై నిర్మిస్తున్న వంతెన పనులను వేగవంతం చేయాలని సూచించినట్లు తెలిపారు. తెల్లాపూర్‌ రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు తెల్లాపూర్‌ వరకు ఎంఎంటీఎస్‌ రైళ్లను పెంచి ప్రజలకు రైల్వే సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. తెల్లాపూర్‌ నుంచి విద్యుత్‌నగర్‌ కాలనీకు వెళ్ళే మార్గంలోని రైల్వేఅండర్‌ బ్రిడ్జ్‌ను వెడల్పు చేయాలని రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌ జైన్‌ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, కౌన్సిలర్‌ శంషాబాద్‌ రాజు, నాయకులు ఆంజనేయులు, నరేందర్‌ రెడ్డి, నర్సింగ్‌ గౌడ్‌, రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్నా..

• మౌలిక సౌకర్యాల కల్పన అంతంతే.. • మంత్రి రాకతోనైనా పరిష్కారమయ్యేనా..?



తెల్లాపూర్‌..

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్‌ మున్సిపాలిటీ శరవేగంతో మహానగరాన్ని తలపించే విధంగా రోజురోజుకు అభివృద్ధిలో దూసుకుపోతుంది. ఈ ప్రాంతంలో ఐటీ నిపుణులు, ఎన్‌ఆర్‌ఐలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, వ్యాపారస్తులు నివాసాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఐతే పాలకులు మాత్రం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలపై గతంలోనూ ఉద్యమించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం రావడం, మొదటిసారిగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌ రాజనర్సింహ రాకతో ఈ ప్రాంత సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో స్థానికులు ఎదురుచూస్తున్నారు.

చెరువులు కబ్జాలు..

రింగ్‌రోడ్డు కారణంగా ఈ ప్రాంతంలో భూముల విలువ ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో రియల్‌ వ్యాపారులు చెరువులు, కుంటలను, వరద కాలువలను సైతం వదలడంలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాటిలో జోరుగా నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానికులు ఎవరైన ఫిర్యాదు చేస్తే అధికారులు అక్కడికి వచ్చి నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రసుత్తం చెరువులు, వరద కాలువలు వాటి ఉనికి కోల్పోతున్నాయి.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది. కానీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆగిన కూరగాయల మార్కెట్‌..

తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్‌ లేకపోవడంతో స్థానికులు దూరప్రాంతాలకు వెళ్లి కూరగాయలను తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ నిర్మాణం కోసం శ్రీకారం చుట్టింది. అందుకోసం రూ.2కోట్ల నిధులను మంజూరు చేసి పనులను ప్రారంభించారు. ప్రస్తుతం మార్కెట్‌ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి.

తాగునీటి సమస్య...

మున్సిపాలిటీ పరిధిలోని పలు గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీలలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. వీరికి మిషన్‌ భగీరథ నీటిని అందించాలని ఆయా కాలనీల వాసులు డిమాండ్‌ చేస్తున్నారు.

నిలిచిన కల్యాణ మండపం పనులు

తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో కల్యాణ మండపం లేకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రైవేట్‌ మండపాల్లో శుభకార్యాలు చేసుకోలేక ఇళ్ల ముందే నిర్వహించుకుంటున్నారు. ఈ క్రమంలో గత ప్రభుత్వం కల్యాణ మండపం కోసం భూమిని కేటాయించి, నిధులను మంజూరు చేశారు. ప్రస్తుతం మండపం పనులు మధ్యలోనే ఆగిపోయాయి.

అసంపూర్తిగా రేడియల్‌ రోడ్లు..

గత 10ఏళ్ళ క్రితం శేరిలింగంపల్లి పరిధిలోని గోపనపల్లితండా నుంచి తెల్లాపూర్‌ మీదగా రింగ్‌రోడ్డు వరకు రేడియల్‌ రోడ్డును అభివృద్ధి చేశారు. కానీ ఈ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ మార్గంలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

రైల్వే స్టేషన్‌కు దారిలేక...

తెల్లాపూర్‌లో రైల్వేస్టేషన్‌ ఉన్నప్పటికీ ప్రజలకు మాత్రం ఎలాంటి ఉపయోగం లేదు. రైల్వే స్టేషన్‌కు దారి లేకపోవడంతో ప్రజలు రైల్వే సేవలకు దూరమవుతున్నారు. రైల్వే స్టేషన్‌కు అనుకొని ఉన్న రేడియల్‌ రోడ్డు నెంబర్‌ 7కు అనుసంధానంగా రోడ్డును అభివృద్ధి చేస్తే స్థానికులకు రైల్వే సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఆసుపత్రి కట్టాలి..

తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ పరంగా ఆసుపత్రిని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

తెలంగాణపురంగా పేరు మార్చాలి..

తెల్లాపూర్‌కు మంచి చరిత్ర ఉంది. పూర్వం తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పిలిచేవారు. అందుకు సంబంధించిన శాసనం తెల్లాపూర్‌లో ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో టీ ఆర్‌ఎస్‌ అగ్ర నేతలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పేరు మారుస్తామని హామీ ఇచ్చారని ,నేటికీ ఆ హామీ అమలు కాలేదు.

డబుల్‌ ఇళ్లు కేటాయించాలి..

తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో కొల్లూర్‌లో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగిందని గతంలో స్థానిక నేతలు ఆరోపించారు. ఈ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి..

గ్రంథాలయం లేక యువకులు, విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. పుస్తకాల కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం పాలకులు స్పందించి గ్రంథాలయంను ఏర్పాటుచేయాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

చెరువులోకి మురుగునీరు

తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు మురుగునీటితో నిండిపోయాయి. పలు గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీల నుంచి మురుగునీరు చెరువులో చేరుతుంది. దీన్ని నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారు. గత ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి రియల్‌ సంస్థలకు దత్తతు ఇచ్చారు. కానీ పనులను మధ్యలోనే ఆపివేశారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.



మురుగునీటితో నిండిన చెరువు

అవగాహన ర్యాలీ

మాదాపూర్‌: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని దుర్గం చెరువు ఐటీసీ కోహినూర్‌ నుంచి టీ హబ్‌ వరకు 2 కిలోమీటర్ల ర్యాలీ నిర్వహించారు. గురువారం ఉదయం ఐటీసీ కోహినూర్‌ సిబ్బంది, పలు కళాశాలల విద్యార్థులు ప్రభుత్వ యోగాధ్యాయన పరిషత్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని యోగా ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

23న బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం బాల బృందావనంను స్టోరీ ఆఫ్‌ జగదాంబ(మమ్మా)పేరిటనిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటలవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో పాల్గొనేందుకు 9 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకే అవకాశం కల్పిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్‌ 040-23001234, 8143466670లో సంప్రదించాలి.

సీసీ కెమెరాలు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): సీజీఆర్‌ ట్రస్టు సహకారంతో రూ.1.60 లక్షలతో అందుబాటులోకి తెచ్చిన వైకుంఠరథంతో పాటు, నూతనంగా ఏర్పాటు చేసిన పది సీసీ కెమెరాలను గురువారం జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌ ముఖ్య అతిధిగా హాజరై గుమ్మడిదలలో ప్రారంభించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ ట్రస్టు అధినేత గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్‌, తహశీల్దార్‌ గంగాభవాని, ప్రత్యేక అధికారి అఖిలేష్‌రెడ్డిలతో పాటు స్థానిక నాయకులు నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



మూసాపేట: బాలాజీనగర్‌ డివిజన్‌ అంబేద్కర్‌ నగర్‌లోని ముళ్లకత్వ చెరువులో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌ బాల్స్‌ వేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్‌ బాబురావు మాట్లాడుతూ చెరువులోని గుర్రపు డెక్కను తొలగిస్తామని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ కమిషనర్‌ రజనీకాంత్‌రెడ్డిని కలిసిన రవికుమార్‌యాదవ్‌ తదితరులు

శేరిలింగంపల్లి: వర్షాకాలం నేపథ్యంలో శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలోని బస్తీలు, కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటి కమిషనర్‌ రజనీకాంత్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్‌ గురువారం కోరారు. వరద నీరు సాఫీగా వెళ్ళేలా నాలాలు, కల్వర్టులను శుభ్రం చేయించాలని సూచించారు. అదే విధంగా అంజయ్యనగర్‌, సిద్ధిక్‌నగర్‌ బస్తీల్లోని ప్రభుత్వ భూముల్లో వెలుస్తున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవడంతో పాటు బొటానికల్‌ గార్డెన్‌ నుంచి మసీద్‌బండ సర్కిల్‌ వరకు రోడ్డు విస్తరణ పనుల తీరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కంటెస్టెడ్‌ కార్పొరేటర్‌ ఎల్లేష్‌, నాయకులు ఆంజనేయులు సాగర్‌, చందు, భిక్షపతి పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

రాయదుర్గం: నెట్‌ పరీక్షను రద్దు చేయడంపై నిరసన తెలుపుతూ హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి పరీక్ష రాస్తే దాన్ని రద్దు చేయడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన బీజేపీ నేతలు



గచ్చిబౌలి: కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌ శంషాబాద్‌ ఎయిర్‌పోర్టులో గురువారం కలిశారు. ఢిల్లీ నుంచి వచ్చిన వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ



హఫీజ్‌పేట్‌ అంబేద్కర్‌నగర్‌లో విద్యార్థికి మాత్ర వేస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్‌



శేరిలింగంపల్లి హైస్కూల్‌లో టాబ్లెట్స్‌ వేస్తున్న కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌, డాక్టర్‌ సృజన

శేరిలింగంపల్లి: సీజనల్‌ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శేరిలింగంపల్లి జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్‌ మాట్లాడుతూ వైద్యశాఖ సూచించిన విధంగా విద్యార్థులు ఆల్బెండజోల్‌ మాత్రలు వేసుకోవాలన్నారు. విద్యార్థులకు బుక్స్‌, నోట్‌ బుక్స్‌, యూనిఫారాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్‌ సృజన, మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ చందర్‌, సీహెచ్‌ఓ స్వామి, ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌ యాదవ్‌, ఉపాధ్యాయులు బలరాం, శివకుమార్‌, బల్వంత్‌రెడ్డి, కరుణ, గోపాల్‌, చంద్రప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్‌ ప్రాథమిక పాఠశాలలో ..

హఫీజ్‌పేట్‌ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హఫీజ్‌పేట్‌ అంబేద్కర్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో కలిసి హఫీజ్‌పేట్‌ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీకాంత్‌ ఆల్బెండజోల్‌ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ శ్రీకాంత్‌ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సునీత, ల్యాబ్‌ టెక్నీషియన్‌ పండరి రెడ్డి, ఏఎన్‌ఎం మౌనిక, ఆశా వర్కర్లు రజిని, స్వప్న పాల్గొన్నారు.

యోగాపై ఏబీవీపీ ఓరియంటేషన్‌ డే



రాయదుర్గం: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్శిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్‌ ఆధ్వర్యంలో గురువారం యోగా ఓరియంటేషన్‌ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని వివేకానంద అమినిటీస్‌ సెంటర్‌ ముందు యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు బాలకృష్ణ, ఏబీవీపీ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షయపాత్ర- ఏడీపీ సంస్థ చేయూత

37వేల మంది పిల్లలకు భోజనాలు అందజేత



కార్యక్రమాన్ని ప్రారంభించిన ఏడీపీ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సీనియర్‌ వైస్‌ప్రెసిడెంట్‌ వెంకటేష్‌

రాయదుర్గం: ఏడీపీ హైదరాబాద్‌ సంస్థ తన ఔదార్యాన్ని చాటుకుంది. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌లోని బిజినెస్‌ అవుట్‌సోర్సింగ్‌, హ్యూమన్‌ క్యాపిటల్‌ మేనేజ్‌మెంట్‌ టెక్నాలజీ, సొల్యూషన్స్‌ సేవలందించే ఏడీపీ ఐటీ సంస్థ నెల రోజుల్లో 37వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 9 లక్షల భోజనాలు అందించేందుకు ముందుకొచ్చింది. అక్షయపాత్ర ఫౌండేషన్‌ సహకారంతో సీఎస్‌ఆర్‌ కార్యక్రమంలో భాగంగా ఏడీపీ సంస్థలోని అసోసియేట్‌ వారి కుటుంబం ముగ్గురు పిల్లలకు ఆహారం అందించేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా ఏడీపీ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సీనియర్‌ వైస్‌ప్రెసిడెంట్‌, హెచ్‌ ఆర్‌ హెడ్‌ వెంకటేష్‌ మాట్లాడుతూ కార్పొరేట్‌ సామాజిక బాధ్యతగా గత 25 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు దేశమంతటా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌, పూణే కార్యాలయాల్లోని అసోసియేట్‌లతో విరాళాలు, దాతృత్వ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): క్రీడా ప్రాంగణం కోసం కేటాయించిన స్థలం కబ్జాకు గురవుతుందని, అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు రవీందరెడ్డి కోరారు. గురువారం బొల్లారంలో ఆయన మాట్లాడుతూ బొల్లారం మున్సిపల్‌ పరిధిలోని 284 సర్వేనంబర్‌లో 30 గుంటల స్థలాన్ని క్రీడా ప్రాంగణం కోసం అధికారులు కేటాయించారన్నారు. ప్రస్తుతం ఈ స్థలం కబ్జాకు గురవుతుందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫుట్‌బోర్డు ప్రయాణంపై ఆర్టీసీ స్పెషల్‌ డ్రైవ్‌



డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌సీయూ డిపో మేనేజర్‌ మురళీధర్‌రెడ్డి

రాయదుర్గం: ఆర్టీసీ బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలతో ప్రమాదాల బారినపడకుండా ఆర్టీసీ సంస్థ స్పెషల్‌ డ్రైవ్‌ చేపట్టింది. సికింద్రాబాద్‌ రీజనల్‌ పరిధిలో మొదటి విడత ప్రయోగాత్మకంగా అమలు చేస్తూ ఇది విజయవంతమైతే రాష్ట్రమంతా అమలు చేసేలా ఆర్టీసీ సంస్థ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గచ్చిబౌలిలోని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్శిటీ ఆర్టీసీ డిపో పరిధిలో గురువారం ఈ స్పెషల్‌ డ్రైవ్‌ కార్యక్రమాన్ని అమలు చేశారు. డిపో మేనేజర్‌ మురళీధర్‌రెడ్డి డిపో అధికారులు, సిబ్బందితో వెళ్ళి మొదటిరోజు లింగంపల్లి నుంచి ఆల్విన్‌కాలనీ వరకున్న బస్టాపులలో బస్సుల రాకపోకలు, బస్సులు నిలిపే పద్ధతిని, ఫుట్‌బోర్డు ప్రయాణం , ఆక్యుపెన్సిరేషియోను ఆయన పరిశీలించారు. అనంతరండ్రైవర్లు, కండక్టర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రయోగాత్మకంగా అమలు

ఆర్టీసీ బస్సులలో ఫుట్‌బోర్డు ప్రయాణం ఎంత ప్రమాదకరమో డ్రైవర్లు, కండక్టరకు అవగాహన కల్పించేందుకు ప్రయోగాత్మకంగా స్పెషల్‌ డ్రైవ్‌ కార్యక్రమాన్ని సికింద్రాబాద్‌ రీజియన్‌ పరిధిలో అమలు చేయడం జరుగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాం. వారం పాటు ఈ స్పెషల్‌ డ్రైవ్‌ కొనసాగుతుంది.

–హెచ్‌సీయూ డీఎం మురళీధర్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 3లక్షల 96 వేల రూపాయల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు గురువారం ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారిని ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్‌ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, కాశీనాద్‌ యాదవ్‌, రాంచందర్‌, అంకారావు, స్వప్న పాల్గొన్నారు.

పెండింగ్‌ పనులను వెంటనే పూర్తి చేయాలి

నిజాంపేట్‌: వర్షాకాలం నేపథ్యంలో పెండింగ్‌ పనులను సత్వరమే పూర్తి చేయాలని నిజాంపేట్‌ మేయర్‌ కొలన్‌ నీలారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో కమిషనర్‌ రామకృష్ణారావు అధ్యక్షతన అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షలో మేయర్‌, ఎస్‌ఇ సత్యనారాయణలతో పాటు వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్‌ పరిధిలోని వివిధ డివిజన్లలో ఇప్పటికే భూగర్భ డ్రైనేజీ, నాలాలు, రోడ్ల పనులు కొనసాగుతున్నాయని, వాటిని మరింత త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు నెలకొన్న కాలనీలు, బస్తీల్లో కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు.

విద్యతో మంచి భవిష్యత్‌

నిజాంపేట్‌: పేదల తలరాతలు మార్చేది విద్యేనని, ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకోవాలని కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇంఛార్జి కొలన్‌ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం బాచుపల్లిలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, మధ్యాహ్న భోజన పథకం కింద మెరుగైన పౌష్టికాహారాన్ని అందజేయడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన కొనసాగిస్తోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ కాసాని సుధాకర్‌, కార్పొరేషన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.